క్లుప్తంగా

చిరు వ్యాపారికి చేయూత



మొక్కజొన్న పొత్తులు అమ్మే మహిళకు తోపుడు బండి అందజేస్తున్న తాతాజీ

పాలకొల్లు సెంట్రల్: రోడ్డుపై మొక్కజొన్న పొత్తుల వ్యాపారం చేసుకునే మహిళకు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ శుక్రవారం తోపుడు బండిని అందించారు. యడ్ల తాతాజీ మాట్లాడుతూ బస్టాండ్ సెంటర్‌కు చెందిన పేరంటాలు అనే మహిళ కుటుంబ పోషణ నిమిత్తం మొక్కజొన్నపొత్తుల వ్యాపారం చేసుకుంటుందన్నారు. వ్యాపారానికి సరైన తోపుడు బండి లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతుందని తెలిపారు. దాంతో తనను తోపుడు బండి ఇప్పించాలని పేరంటాలు కోరడంతో ఆమెకు బండిని అందజేశానన్నారు. కార్యక్రమంలో చెన్ను విజయ్, కొరగింజల హనుమంతు, కొరగింజల శ్రీనివాసు, జోగాడ ఉమామహేశ్వరరావు, జోగి వడ్డికాసులు, పాలపర్తి కృపానాథ్, జోగి వెంకటేశ్వరరావు, జాన్ విక్టర్, దొంగ సతీష్ పాల్గొన్నారు.

చోరీ స్థలం పరిశీలన



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ రవి ప్రకాష్

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో గురువారం తాళం వేసి ఉన్న ఇంటిలో బంగారు నగలు చోరీ జరిగిన ఇంటిని జిల్లా ఎస్పీ రవిప్రకాష్ పర్యవేక్షించారు. శుక్రవారం పట్టణానికి వచ్చిన ఎస్పీ రవిప్రకాష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఎస్పీ మనోహరాచారి, సీఐ దారావత్తు రాంబాబు, ఎస్సైలు బాదం శ్రీనివాసు, ముత్యాలరావు తదితరులు ఉన్నారు.

న్యాయవాద రక్షణ చట్టం అమలు చేయాలి



నరసాపురంలో కోర్టువద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

నరసాపురం రూరల్: న్యాయవాదుల మీద దాడలకు నిరసనగా వెంటనే న్యాయవాద రక్షణ చట్టం అమలు చేయాలని కోరుతూ నరసాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కోర్టు ఎదుట నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా దానయ్యానాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో కృష్ణాజిల్లా మొవ్వ గ్రామంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జి.శ్రీనివాసరావుపై జరిగిన దాడికి నిరసనగా విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఆర్‌జీ కుమార్, చోడదాసి శ్రీధర్, పోలిశెట్టి రఘురామ్, కొత్తపల్లి రమేష్, నెక్కంటి క్రాంతికుమార్, శ్రీహరి, కొప్పినీడి పద్మజ, జ్యోతి,శిరీష, బొలిశెట్టి నవీన్, నక్కా ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆచంట చేరిన బైక్ యాత్ర



మార్టేరులో వైఎస్సార్ సీపీ నాయకులతో రాజు

పెనుమంట్ర: నెల్లూరు జిల్లా జలదంకి మండలం అన్నవరం గ్రామానికి చెందిన వైఎస్ రాజశేఖర రెడ్డి అభిమాని అడవికొట్టు రాజు మే 14న తన స్వగ్రామం నుంచి ప్రారంభించిన 175 నియోజకవర్గాల బైక్ ప్రచారయాత్ర శుక్రవారం ఆచంట నియోజకవర్గానికి చేరింది. మధ్యాహ్నం పాలకొల్లునుంచి బైక్‌పై ఆచంట చేరుకున్న రాజు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీమంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజుని మర్యాద పూర్వకంగా కలిశారు.అనంతరం మార్టేరు సెంటర్ నుంచి పెనుగొండ మీదుగా తణుకు నియోజకవర్గానికి బయలుదేరిన రాజు మార్టేరు వైఎస్సార్ సెంటర్‌లో పెనుమంట్ర మండల మాజీ కన్వీనర్ కర్రి వేణుబాబు, విద్య మౌలిక వసతుల సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ కొవ్వూరి వేణుమాధవ రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. 69 రోజుల తన బైక్ యాత్రలో 164 నియోజకవర్గాలను సందర్శించానని, శనివారం తణుకు, నర్సాపురం, ఆదివారం భీమవరం, ఉండి నియోజకవర్గాలలో తన బైక్ యాత్ర కొనసాగుతుందని ఆయన తెలిపారు.

రేషన్ డీలర్‌పై కేసు

పెనుమంట్ర: మండలంలోని వెలగలేరు 28 నంబర్ చౌకడిపో డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు పెనుమంట్ర సీఎస్ ఆర్ఐ వి.పోతురాజు శుక్రవారం తెలిపారు. డీలర్ అవకతవకలకు పాల్పడుతున్నాడని గ్రామస్తుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు డిపోను శుక్రవారం తనిఖీ చేశారు. స్టాకులో వ్యత్యాసాలు ఉన్నందున 6ఏ కేసు నమోదు చేశారు. కందిపప్పు 72 కిలోలు, పంచదార 5 కిలోలు, బియ్యం 70 కిలోలు స్టాకులో తక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు.

పుడమి తల్లికి పచ్చబొట్లు

- ఆచంట నియోజకవర్గంలో వేగంగా వరినాట్లు
- వర్షాల జోరుతో ముమ్మురం చేసిన రైతన్నలు



వడలిలో నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు



చిన్నం వారి పాలెంలో నారు తీస్తున్న బెంగాలీలు



వెంకట్రామపురంలో దమ్ము చేస్తున్న రైతన్న

పెనుగొండ: కాలువలకు నీరు రావడం, వర్షాలు ప్రారంభం కావడంతో వరి నాట్లు ఊపందుకొన్నాయి. ఈ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు, ఎండ తాకిడితో వరి నాట్లు ఆలస్యమయ్యాయి. ఈ నెల మొదట్లోనే కాలువలకు నీరు వచ్చినా, వర్షం లేకపోవడంతో సాగు కొంతమేర ఆలస్యం అయ్యింది. దీంతో కేవలం నారుమడులు వేయడంతోనే రైతులు సరిపుచ్చుకొన్నారు. వారం రోజులుగా వర్షం పడడం, కాలువల్లో నీరు సమృద్ధిగా రావడంతో నాట్లు వేయడం ప్రారంభించారు. ఆచంట నియోజకవర్గంలో ఆచంట మండలంలో 4500 హెక్టార్లు, పెనుగొండలో 5047 హెక్టార్లలోనూ, పెనుమంట్రలో 5446 హెక్టార్లు, పోడూరులో 2968 హెక్టార్లలో వరిసాగు చేస్తున్నారు. వీటిలో ఇప్పటికే 10 శాతంకు పైగా వరి నాట్లు సైతం వేయడం పూర్తి చేశారు.

బెంగాలీ కూలీలతోనే..

వర్షాలు అధికంగా కురుస్తుండడంతో రైతులు అందరూ ఒక్కసారిగా నాట్లు వేయడానికి సిద్ధం అవుతున్నారు. వీరంతా ఎక్కువగా బెంగాలీ కూలీలపై ఆధార పడుతున్నారు. నాట్లు వేయడానికి ఖర్చు తక్కువగా అవడం, వేగంగా నాట్లు వేయడంతో పాటు, ఎకరానికి ఉపయోగించే నారు తక్కువగా ఉండడంతో రైతులు ఎక్కువ భాగంగా బెంగాలీ కూలీలపైనే ఆధార పడుతున్నారు. నియోజకవర్గంలో రైతులు ఎక్కువగా అధిక దిగుబడులు నిచ్చే వరి వంగడాలైన ఎంటీయూ 1318, పీఎల్ 1100, ఎంటీయూ 7029 రకాల సాగుపైనే మక్కువ చూపిస్తున్నారు. మరో 15 రోజుల్లో నాట్లు పూర్తి కావచ్చని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. వేగంగా వరినాట్లు పూర్తి చేసుకోవాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

వలంటీర్లకు వందనం

ప్రాణాలకు తెగించి విధులు



కరోనా సమయంలో మొగల్తూరు గ్రామంలోకి ఎవరూ రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆ సమయంలో నా క్లస్టర్ పరిధిలో ఉన్న కాజులూరి నాగేశ్వరరావు, లీలావతి ఇద్దరికీ కరోనా సోకింది. డేంజర్ జోన్‌గా ఉన్న ప్రాంతంలోని వారి ఇంటికి వెళ్లి పూర్తి వివరాలు తీసుకుని డాక్టర్లకు సమాచారం అందించాను. బాధితుల ఇంటికి చేరుకున్న డాక్టర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్ల సహాయంతో వారిని పాలకొల్లుని ఆసుపత్రికి తరలించాం. నా పరిధిలోనే ఎక్కువ మంది కరోనా బారిన పడిన వారు ఉండటంతో రోజూ ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తించాను. – రాజేష్, వలంటీర్, మొగల్తూరు

వలంటీర్ల సేవలు ఎనలేనివి



కరోనా సమయంలో వలంటీర్లు అందించిన సేవలు ఎనలేనివి. కరోనా ఎక్కువగా ఉన్న రోజుల్లో మా ఇంటికి ఎవరూ వచ్చేవారు కాదు. అయితే వలంటీర్లు ప్రాణానికి తెగించి మా యోగక్షేమాలు తెలుసుకునే వారు. పోలీసులు, ఏఎన్ఎంలతో కలిసి రెడ్ జోన్‌లో కూడా తిరుగుతూ సేవలు అందించారు. – ఉద్దగిరి సుబ్బారావు, మొగల్తూరు

అర్హులందరికీ అమ్మఒడి



ఇలపకుర్రులో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

యలమంచిలి: పదో తరగతి, ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు అమ్మ ఒడి పథకం వర్తింపజేశామని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ చెప్పారు. ఇలపకుర్రు హైస్కూల్ ప్రాంగణంలో శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష గ్రామ సభలో ఆయన మాట్లాడారు. జగనన్న విద్య, వైద్యం, సంక్షేమం, వ్యవసాయ రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని భావించి ఒక్క ఇలపకుర్రు గ్రామంలోనే గత నాలుగేళ్లలో వివిధ పథకాల కింద మహిళలకు వారి బ్యాంకు ఖాతాలలో రూ.7 కోట్లు జమ చేసినట్లు చెప్పారు. ఇలపకుర్రు గ్రామానికి జేజేఎం పథకంలో రూ.1.70 కోట్లు మంజూరు చేశామన్నారు. ఈ నిధులతో గ్రామంలో అదనపు వాటర్ ట్యాంకు నిర్మాణంతో పాటు పైపులైన్ విస్తరణ చేసి ప్రతి ఇంటికీ కుళాయి ఇస్తామని చెప్పారు. నాడు–నేడు పథకంలో గ్రామంలోని పాఠశాలను రూ.65 లక్షలతో అభివృద్ధి చేసినట్లు వివరించారు. గడప గడపకూ మన ప్రభుత్వ నిధులు రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్లు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిలువూరి కుమార దత్తాత్రేయ వర్మ, ఎంపీపీ రావూరి వెంకటరమణ, ఎంపీటీసీ కంబాల తిరుమల వెంకటేశ్వరరావు, సచివాలయ మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావు, ఉప సర్పంచ్ కుడక ప్రసాదరావు, పార్టీ నాయకులు రావూరి వెంకట కోటి మురళీకృష్ణ, ఉచ్చుల స్టాలిన్, చిట్టూరి ఏడుకొండలు పాల్గొన్నారు.

మహిళాభ్యుదయమే ప్రభుత్వ లక్ష్యం



మహిళలతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బి.శ్రీవెంకటరమణ

నరసాపురం రూరల్: ప్రభుత్వం మహిళాపక్షపాతిగా పని చేస్తూ వారి అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ బి.శ్రీవెంకటరమణ అన్నారు. నరసాపురం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం మెప్మా ఆధ్వర్యంలో మెప్మా అర్బన్ మార్కెట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల ఫలాలను ఎక్కువ మేర మహిళల ఖాతాల్లోకి వేస్తూ వారి సంక్షేమానికి పట్టం కడుతుందన్నారు. పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) స్వయం సహాయక సంఘాల నుంచి మహిళా సభ్యులు తయారు చేసిన వస్తు ఉత్పత్తుల ప్రదర్శన వారి వ్యాపార కృషిని తెలియజేస్తున్నాయన్నారు. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో మహిళలు వ్యాపార వేత్తలుగా ఎదిగి ఆర్థిక పరిపుష్టిని సాధిస్తున్నారన్నారు. డ్వాక్రా రుణాలు తీసుకున్న మహిళలు స్వయంగా ఉపాధి పొందడం కోసం వారు సొంతంగా తయారు చేసిన ఉత్పత్తులను ఒక్కరోజు సేల్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ఆయా వస్తు ఉత్పత్తుల గురించి పది మందికి తెలియజేయడంతోపాటు ఇతర మహిళలకు కూడా మార్గదర్శకంగా ఉంటుందని చైర్‌పర్సన్ అన్నారు. పట్టణంలో ఉన్న 90 డ్వాక్రా గ్రూపులకు సుమారు 4 కోట్ల మేర రుణాలను అందించామని, వారు తీసుకున్న రుణాలను సక్రమంగా వినియోగించుకుని ఆర్థికంగా నిలబడటంతోపాటు తక్కువ ధరలకే నాణ్యమైన ఉత్పత్తులను అందించడంతో ప్రజలకు కూడా మేలు జరుగుతుందన్నారు. పట్టణంలో శాశ్వత ప్రాతిపదికన మెప్మా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రసాదరాజు సహకారంతో మహిళా మార్ట్‌ను కూడా ప్రారంభించుకుందామని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. తొలుత అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆమె పరిశీలించి ఆయా ఉత్పత్తులు, వ్యాపారం గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కామన నాగిని, కొత్తపల్లి నాని, మెప్మా టౌన్ ప్రెసిడెంట్ మోకా అశ్విని తేజ, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, మెప్మా సీఎంఎం సోమాని భాస్కర్, సీఓ కృష్ణ ప్రసాద్, సిబ్బంది షణ్ముఖదేవి, భూసారపు జయ, చిట్టూరి కృష్ణ, తిరుమాని రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

అపుస్మాపై ఆక్వా రైతు సంఘం హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న ఆక్వా సంఘం సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: ఆక్వా రైతుల కోసం ప్రభుత్వం అపుస్మా సంఘం ఏర్పాటు చేయడం అభినందనీయమని జై భారత్ క్షీరారామ ఆక్వా సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్ రాజు తెలిపారు. శుక్రవారం స్థానిక ఆక్వా సంఘం నూతన భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గాంధీభగవాన్‌రాజు మాట్లాడుతూ పాలకొల్లు, నరసాపురం, ఆచంట మూడు నియోజకవర్గాలకు సంబంధించి ఆక్వా రైతులతో నూతన సంఘం ఏర్పాటు చేశామన్నారు. ఆక్వా రైతులు సమస్యలను పరిష్కరించుకోవాలంటే అందరూ సంఘంలో చేరాలని సూచించారు. అందరూ సంఘటితంగా ఉంటే సమస్యలను పరిష్కరించుకోవడానికి బలం చేకూరుతుందన్నారు. రెండు రోజులు క్రితం ఏపీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అపుస్మా సమావేశంలో ఇండియన్ ఫెడరేషన్ చైర్మన్ మోహనరాజు, అపుస్మా వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్‌లు పాల్గొన్నారన్నారు. ఈ సమావేశంలో ఆక్వా రైతుల సమస్యలు వివరించామని తెలిపారు. సమస్యలు పరిష్కారం చేసే విధంగా త్వరలో ఆక్వా రైతు సంఘం సభ్యులతో ఆక్వా ప్రాసెసింగ్ ప్లాంట్, సీడ్ ప్లాంట్, ఐస్ ప్లాంట్‌ల యజమానులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం శుభ పరిణామమని తెలిపారు. ఆక్వా రైతు విజయంలో ఇది మొదటి అడుగుగా భావిస్తున్నామన్నారు. ఆక్వా రైతు బాగుండాలంటే మూడు నెలలు పంట విరామం కావాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సెక్రటరీ బోణం నరసయ్య, కోడి విజయభాస్కర్, జాన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల నిరసన

మొగల్తూరు: వీఆర్ఏలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. రాష్ట్ర రెవెన్యూ సహాయకుల సంఘం ఇచ్చిన పిలుపుమేరకు రెండు రోజు శుక్రవారం మోకాలుపై కూర్చుని నిరసనను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చంటి బాబు, గణేష్,వెలిది కృష్ణ, ప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

పోడూరులో..

పోడూరు: సమస్యల పరిష్కారం కోరుతూ మండల రెవిన్యూ సేవకుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్ఏలు రెండోరోజు దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బెల్లాని ప్రకాశరావు, కడిమి ఏసు, నల్లి సుమన్, కంతేటి సూర్యనారాయణ పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఎస్టీ కాలనీ వాసులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఫాజిల్

నరసాపురం రూరల్: గోదావరి వరద ఉధృతి పెరగనున్న దృష్ట్యా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నరసాపురం తహసీల్దార్ ఎస్ఎం ఫాజిల్ అన్నారు. శుక్రవారం నరసాపురం మండలం పాత నవరసపురం, కొత్తనవరసపురం ఎస్టీ కాలనీ ప్రాంతాలను ఆయన పర్యటించారు. గ్రామ ప్రజలతో ఆయన మాట్లాడి ప్రస్తుత పరిస్థితిని గురించి వివరించారు. ప్రస్తుతం ఉన్న వరద ఉధృతిని అంచనా వేశారు. కల్వర్టు బాగు చేయడం వల్ల గ్రామంలోని వరదనీరు వచ్చే అవకాశం లేదని ఎస్టీకాలనీ ప్రజలు తహసీల్దార్‌కు వివరించారు.ఎటువంటి పరిస్థితి ఎదురైనా సురక్షిత ప్రాంతాలకు రావడానికి సిద్ధంగా ఉండాలని ఆయన అన్నారు. గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఎంతమంది ఉన్నారని ఆయన ఆరా తీశారు. ఈ నెలలో నిత్యావసరాలు తీసుకున్నారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. వరద ప్రభావిత గ్రామాల్లో సంబంధిత పంచాయతీ కార్యదర్శులు అందుబాటులోఉండి ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేసి మండల కార్యాలయానికి వెంటనే తెలియజేయాలన్నారు. గ్రామాల్లో బ్లీచింగ్ చల్లించాలని, పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శికి ఆయన సూచించారు. గోదావరి ఉధృతిని, ఏటిగట్టును ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. తహసీల్దార్ వెంట ఎస్సై సుధాకరరెడ్డి, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పెనుగొండ లక్ష్మికి అభినందన



పెనుగొండ లక్ష్మిని అభినందిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: ఆంధ్రప్రదేశ్ కుమ్మరి, శాలి వాహన సంఘ వెల్ఫేర్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన నెగ్గిపూడి ఎంపీటీసీ సభ్యురాలు పెనుగొండ లక్ష్మిని మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అభినందించారు. శుక్రవారం తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, మాజీ మండల కన్వీనరు సత్తి విష్ణుకుమార్ రెడ్డి, నెగ్గిపూడి పంచాయతీ సభ్యుడు పెనుగొండ నరసింహమూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల అందజేత

పాలకొల్లు సెంట్రల్: స్థానిక జీవీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో రేపాక వారి సత్రం ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. శుక్రవారం పాఠశాలలో రేపాక వారి సత్రం చైర్మన్ రేపాక వెంకట వీర్రాజు 75 మంది విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం, దాతలు అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్, బెజవాడ సత్యనారాయణ, రామలింగేశ్వరరావు, ఉపాధ్యాయులు బి. త్రిమూర్తులు, బొక్క భవానీదుర్గ, శశికళ, చంద్రకళ పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న రేపాక సత్రం సభ్యులు

రేపు ఎస్‌వీకేపీ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సదస్సు

పెనుగొండ: స్థానిక ఎస్‌వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సదస్సు కళాశాల ఆవరణలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు వివరించారు. 1974 నుంచి చదివిన పూర్వ విద్యార్థులందరూ సదస్సుకు హాజరుకావాలని ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పూర్వ విద్యార్థుల అనుబంధం మరింతగా బలోపేతం చేయడానికి సదస్సు దోహదపడుతుందన్నారు. 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కళాశాల సదస్సు నిర్వహించడం ఆనందదాయకమని కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు పితాని సూర్యనారాయణ, సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కే రామచంద్రరాజు, కోశాధికారి ఉద్దగిరి లవకుమార్ తదితరులు అన్నారు.

నేడు జగనన్న సురక్ష సభలు ఇలా

మొగల్తూరు: మండలంలోని పాతపాడు, కేపీ పాలెం సౌత్‌సచివాలయాల పరిధిలో శనివారం జగనన్న సురక్ష గ్రామ సభలు నిర్వహించనున్నారు. పాతపాడు సచివాలయ పరిధిలో తహసీల్దార్ జి.అనితా కుమారి, కేపీ పాలెం సౌత్ సచివాలయ పరిధిలో ఎంపీడీఓ వి.బాబ్జిరాజు పర్యవేక్షణలో గ్రామ సభలు నిర్వహిస్తారు.

పాలకొల్లు అర్బన్: మండలంలోని ఉల్లంపర్రు, వరిధనం గ్రామాల్లో శనివారం ఉదయం 9.30 గంటల నుంచి ఆయా గ్రామ సచివాలయాల వద్ద జగనన్న సురక్ష గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సంగాని వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. నవరత్నాలు పథకాల ద్వారా లబ్ధి పొందడానికి లబ్ధిదారులకు అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ప్రజాప్రతినిధుల ద్వారా అందించనున్నట్లు ఆయన తెలిపారు. లబ్ధిదారులు హాజరై ధ్రువీకరణ పత్రాలు పొందాలని కోరారు.

పెనుమంట్ర: పెనుమంట్ర–1, మాముడూరు గ్రామాల్లో శనివారం జగనన్న సురక్ష గ్రామ సభలు జరుగుతాయని ఎంపీడీఓ వి.పూర్ణబాబ్జి తెలిపారు. పెనుమంట్ర గ్రామపంచాయితీ వద్ద గ్రామ సభలు మధ్యాహ్నం 3గంటలకు, మాముడూరు గ్రామ సచివాలయం వద్ద జరిగే గ్రామసభ సాయంత్రం 4.30 గంటలకు జరుగుతాయని, ఈ గ్రామ సభలలో స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు పాల్గొంటారని తెలిపారు.

ఆచంట వేమవరంలో మౌలిక సదుపాయాల కల్పన



తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు సమస్యలు చెబుతున్న మహిళలు

పెనుగొండ: ఆచంట వేమవరంలో కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శుక్రవారం ఆచంట వేమవరం ఇందిరమ్మ కాలనీలో రహదారుల నిర్మించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామంటూ కాలనీ మహిళలు విన్నవించుకున్నారు. త్వరలోనే సమస్యలు పరిశీలించి, పరిష్కరిస్తామన్నారు. నియోజకవర్గంలో జగనన్న కాలనీల్లో తాగునీరు. విద్యుత్ సదుపాయాలు, రహదారులు ప్రణాళికబద్ధంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొన్ని గ్రామాల్లో కాలనీలు ఏర్పడి దశాబ్దాలు దాటుతున్నా మౌలిక సదుపాయాల కల్పన చేయకుండా గత పాలకులు నిర్లక్ష్యం చేశారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం పలుకాలనీల్లో సమస్యలు పరిష్కరించామని పేర్కొన్నారు.

ములపర్రులో డ్రెయిన్ల నిర్మాణం

మండలంలోని ములపర్రులో డ్రెయినేజీ నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినట్లు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. శుక్రవారం డ్రెయినేజీ నిర్మాణాలపై సమీక్షించారు. ఇప్పటికే పితాని వారి పాలెంలో డ్రెయినేజీ నిర్మాణం పూర్తి చేశామన్నారు. సీతారాముడు చెరువులో నిర్మాణం త్వరలోనే ప్రారంభిస్తారన్నారు. దీంతో పాటు మరో రెండు ఎస్సీ ఏరియాల్లోనూ డ్రెయినేజీ నిర్మాణాలు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో పెనుగొండ ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), వుమెన్ కార్పోరేషన్ డైరక్టరు బొక్కా అరుణ, ఎస్సీ సెల్ మండల కన్వీనరు పలివెల శ్రీను, సిద్ధాంతం వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జుత్తిగ దామోదర్, యాండ్ర శ్రీను పాల్గొన్నారు.

రహదారి ఏర్పాటుకు భరోసా

సిద్ధాంతం లంకపేట కాలనీ వాసులు నేరుగా అయ్యప్ప స్వామి ఆలయం వరకూ వచ్చేందుకు గానూ రహదారి ఏర్పాటుకు కృషి చేస్తానని మాజీమంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. శుక్రవారం సాయంత్రం సిద్ధాంతంలో జరుగుతున్న గరగాలమ్మ డ్రెయిన్ పనులు పరిశీలించిన అనంతరం రహదారి ఏర్పాటుకు గానూ స్థల సేకరణ చేయాల్సి ఉంటుందని తెలిపారు. దీనికి గాను రైతులకు నష్ట పరిహారం చెల్లించి రహదారి ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు చిన్నం ఏడుకొండలు, సొసైటీ చైర్మన్ బలువు కృష్ణమూర్తి, గ్రామ వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జుత్తిగ దామోదరం, గుత్తుల రాముడు పాల్గొన్నారు.